# తీరని కోరిక

●

[ పి రామారావు ]

"తగిన జీవనోపాధి లభించినంతవరకు యింటికి తిరిగి రాకూడదని" నిశ్చయించుకొని బయలుదేరాడు జీవన్‌లాల్, భార్య జమునాని, ముద్దుకూతురగు ఇందిరని యింటివద్ద వదలిపెట్టి.

జీవన్‌లాల్ యొక నిరుపేద గృహస్థు. తన కులవృత్తియగు మిఠాయి చేసుకొని అమ్మి, వచ్చిన లాభంతో తన కుటుంబమును పోషిస్తుండేవాడు. వారు అల్లారుముద్దుగా పెంచుకొనుచున్న ఇందిర తోటిపిల్లలు మిఠాయికొరకు వచ్చినప్పుడు వారి యొక్క సిరిసంపదులను చూచి తమ కుమార్తె కూడ వారివలెనే విలువగల దుస్తులను ధరించి తిరుగునపుడు చూచి సంతోషించవలెనని అనుకొనెడివారు యీ బొందిలీ దంపతులు. వచ్చిన ప్రతి బాలబాలికను ప్రేమ ఒలుకునట్లుగా ఎత్తుకొని ముద్దాడేవాడు జీవన్. కనుకనే పిల్లలందరకు జీవన్‌లాల్ మిఠాయి అంటే ప్రీతిమెండు. జీవన్ ఎన్నడైన పొరుగూరు పోయినా లేక అసస్వతనుండినను అతని విధులను జమునా నెరవేరుస్తుండేది.

* * *

కాని కాలం వచ్చింది. ఆ చిన్న పల్లెలో కూడ మిఠాయి చేయువారి సంఖ్య అధికం అయినది. సంసారసాగరం ఈదుట చాలా భారంగాయున్నది. దరిద్రదేవత యీ బొందిలీ కుటుంబమునందు ముందుగానే ఆశ్రయం కల్పించుకుంది. ప్రస్తుతం వారిని ఎడతెరపిలేకుండ కాల్చుకుతింటున్నాది- ఆ చిన్ని కుటుంబము ఒక్కొక్కసారి తినుటకు లేక వరుసగా రెండుమూడు రోజులవరకు యుండవలసి వచ్చెడిది- తన ప్రాణసమానమైన ఇందిర కూడ తమతో ఉపవాసముండుట చూచి భరించలేకపోయాడు జీవన్‌లాల్. ఆ పితృహృదయానిని [illegible] తన ముద్దులపట్టియగు ఇందిరను దరిద్రదేవత యొక్క పిడికిలినుంచి విడుపించుట ఎట్లా? వన్న సమస్య వేధించుకుతినడం మొదలుపెట్టింది- ఆపేద వదల్చు కొనడానికి తగిన ధనము కలుగుటలేదు- కనుకనే ధన సంపద నిమిత్తము బయలుదేర నిశ్చయించుకొన్నాడు ఆ నిరుపేద జీవన్‌లాల్-

ఆనాడు అమావాస్య- నాటికి మూడు దినములనుంచి తిండిలేక సొమ్మసిల్లి పడియున్నది ఆ పేద బొందిలీ కుటుంబము- కన్నుపొడుచుకొన్నను ఎదుట వస్తువ కనుపించని కటికచీకటి- దానికితోడు కారుమబ్బులు నాల్గువైపుల అలముకొన్నాయి- చిన్నచిన్న చినుకులు "టప టప" మని ఆ గడ్డి గుడిసెపై పడుతున్నాయి. పోలీసు స్టేషనులోనుంచ గంటలు వినిపిస్తున్నాయి "టంగ్ టంగ్" మని- "ఒకటి, రెండు, మూడు......పన్నెండు" లెక్కపెట్టాడు జీవంలేని జీవన్- మెల్లగా ప్రక్కనుంచి లేచాడు- ఇందిర దగ్గరకు పిల్లిలాగ భారంగా అడుగులువేసుకుంటూ చేరాడు- తన ప్రేమజ్యోతియగు ఇందిరను ముద్దుపెట్టుకొని, ఆచిన్నిపాపని రక్షింపమని జగత్పితుండగు ఆ పరమేశుని ప్రార్థించి, దుఃఖమునంతయు గుడ్లలో క్రుక్కుకొని వదలలేక తన ముద్దుయగు ఇందిరను, భార్యను విడిచి బయలుదేరాడు రైల్వేస్టేషనువైపు.

కలకత్తా చేరాడు, ఏదైన మిల్లులో ఉద్యోగం కొరకు మిల్లులన్నీ గాలించాడు. జీవన్ తన స్వస్థలం విడచివచ్చినా పెద్దమ్మ అతనిని విడచిపుచ్చ లేదు- ఎన్నిమిల్లులు తిరిగినా చెల్లనిదమ్మిడీఅయాడు- ఇంక మిల్లులో లాభములేదనుకొని, తనకి మిఠాయి చేయుట వచ్చుగావున ఏ హోటలులోనైన మిఠాయి చేయువారు కావలయునేమో యని తిరిగాడు- కాని అచ్చట కూడ అంతే...........

(సశేషం)